సాక్షి
మంచిర్యాల

సోమవారం ¦ 8 ¦ ఏప్రిల్ ¦ 2024



తునికాకు షెడ్యూళ్లపై నిరాసక్తత

జిల్లాలో తునికాకు సేకరణపై అనేక కుటుంబాలు ఆధారపడ్డాయి. అయితే తునికాకు కొనుగోళ్ల షెడ్యూల్‌పై కాంట్రాక్టర్లు నిరాసక్తత కనబరుస్తున్నారు. 8లో▸

రంజాన్ వేళలు

సోమ
ఇఫ్తార్
6:33

మంగళ
సహర్
4:41

గరిష్టం/కనిష్టం
40.2 /26.3

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఒకటి రెండు చోట్ల వడగళ్లు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పన్ను వసూలులో ఫస్ట్

- ఉమ్మడి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచిన లక్సెట్టిపేట మున్సిపాలిటీ

లక్సెట్టిపేట: గడిచిన ఆర్థిక సంవత్సర పన్నుల వసూలులో లక్సెట్టిపేట మున్సిపాలిటీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 94.84 శాతం వసూలు చేయగా, 2023–24 ఆర్థిక సంవత్సరంలో 94.87 శాతం పన్నులు వసూలు చేశారు. దీంతో రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో లక్సెట్టిపేట 8వ స్థానంలో నిలిచిందని అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈమేరకు ఇప్పటి నుంచే పన్నుల వసూలుపై దృష్టి పెట్టామని వెల్లడించారు. పూర్తిస్థాయిలో వసూలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష


మంచిర్యాలఅర్బన్: తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. 2,513 మందికిగాను 2,084 మంది హాజరయ్యారు. జిల్లాలో పది పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 1,358 మందికి 1,135 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 9 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన 7వ తరగతి ప్రవేశ పరీక్షకు 511 మందికి 432 మంది, 8వ తరగతికి 405 మందికిగాను 323 మంది, 9వ తరగతికి 185 మందికిగాను 152 మంది, పదో తరగతికి 54 మందికిగాను 42 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో యాదయ్య వివరించారు.

సింగరేణి సమాచారానికి కోడ్ ఎఫెక్ట్

శ్రీరాంపూర్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ ప్రభావం సింగరేణిపై పడింది. ఏరియా స్థాయిలో, గనుల స్థాయిలో కంపెనీకి సంబంధించిన కార్యక్రమాల సమాచారాన్ని కూడా యాజమాన్యం బయటకు తెలుపడం లేదు. గనులపై సమావేశాలు నిర్వహించినా, వైద్య, ఆరోగ్య అవగాహన సదస్సులు, రక్షణ సమావేశాలు, ఇతరాత్ర అభివృద్ధి పనులు చేపట్టినా మీడియాకు సమాచారం ఇవ్వడం లేదు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రచారానికి దూరంగా ఉండాలని యాజమాన్యం అన్ని ఏరియాలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అధికారులు రిటైర్డ్ కార్మికుల సన్మానాలు, వీడ్కోలు కార్యక్రమాల సమాచారం కూడా బయటకు తెలుపడంలేదు. ఎవరినీ ఆహ్వానించడం లేదు.

మూడు రోజులు గూడెం ఎత్తిపోతలు

- ఈనెల 9వరకు కొనసాగింపు..



దెలివరీ పాయింట్ నుంచి కాలువలోకి నీళ్లు..

దండేపల్లి: గూడెం ఎత్తిపోతల కింద ఆలస్యంగా సాగు చేసిన, పంటలతోపాటు ఇంకా కోతకు రాని పొలాల రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఆదివారం నీటిని విడుదల చేశారు. ప్రణాళిక ప్రకారం మూడు రోజుల క్రితమే నీటి ఎత్తిపోతలు నిలిపివేశారు. అయితే చివరి దశలో ఉన్న పంటలు నష్టపోయే అవకాశం ఉందని రైతులు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. ఒక తడి నీరివ్వాలని కోరారు. దీంతో మరో మూడు రోజులు నీరు అందించేందుకు మళ్లీ లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేశారు. ఈనెల 9 వరకు నీటిని అందిస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

కాసుపత్రులు..!



- అనుమతి లేకుండానే ఏర్పాటు
- అర్హత లేనివారితో వైద్యం
- వైద్యులు లేకున్నా.. ఉన్నట్లు చూపుతున్న వైనం..
- టీఎస్‌ఎంసీ తనిఖీల్లో వెలుగులోకి..

మంచిర్యాలటౌన్: వైద్యో నారాయణో హరి.. అంటే వైద్యుడు దేవుడితో సమానం అని అర్థం. దేవుడు ప్రాణం పోస్తే ఆ ప్రాణాన్ని నిలబెట్టే ప్రత్యక్ష దైవంగా వైద్యుడిని భావిస్తుంటారు. ఇక డాక్టర్ అనేది డ్యూటీ కాదు. అది ఒక వృత్తి. డబ్బుతో ముడి పెట్టకుండా సేవా భావంతో నిర్వహించే విధి. కానీ నేటి పరిస్థితులు అలా లేవు. డబ్బు సంపాదన కోసమే డాక్టర్ చదువుతున్నారు. వైద్య విద్య పూర్తి కాగానే పెట్టుబడిదారులతో కలిసి ఆస్పత్రి నెలకొల్పుతున్నారు. అనుమతి లేకపోయినా, అర్హులైన వైద్యులు అందుబాటులో లేకున్నా.. ఉన్నట్లుగా ఏమారుస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. వైద్య వృత్తికే కలంకం తెస్తున్నారు. అనుమతి, అర్హత లేని వైద్యులు రోగులకు చికిత్స చేస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మొద్దు నిద్రలో ఉండడం గమనార్హం. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్(టీఎస్‌ఎంసీ) సభ్యుల తనిఖీలతో జిల్లా కేంద్రంలో ఇలాంటి ఆస్పత్రులు వెలుగులోకి వచ్చాయి. వాటిపై చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వరుస తనిఖీలతో బెంబేలు...

తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్(టీఎస్‌ఎంసీ) నూతన కార్యవర్గం ఇటీవల ఎన్నిక కాగా, ఉమ్మడి జిల్లా నుంచి మెంబర్‌గా, లీగల్ అండ్ యాంటీ క్వాకరీ మెంబర్‌గా ఎన్నికైన ఎగ్గన శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు నెల రోజులుగా జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేస్తున్నారు. ఆర్‌ఎంపీలుగా చలామణి అవుతూ ఆస్పత్రులను ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్న లక్సెట్టిపేటకు చెందిన ఇద్దరిని గుర్తించారు. వారిపై టీఎస్‌ఎంసీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్సను మాత్రమే అందించాల్సి ఉండగా ఇష్టారీతిన యాంటిబయాటిక్స్ వాడడం, సెలైన్ ఎక్కిస్తూ, అవసరాన్ని బట్టి చిన్నపాటి ఆపరేషన్లు సైతం చేస్తున్నట్లుగా గుర్తించారు.

కరోనా సమయంలో పుట్టగొడుగుల్లా..

కరోనా సమయంలో జిల్లాలో పుట్టగొడుగుల్లా ఆస్పత్రులు వెలిశాయి. డబ్బు సంపాదనే లక్ష్యంగా వ్యాపారులు, వైద్యులు కలిసి కార్పొరేట్‌ను తలదన్నేలా ఆస్పత్రులు ఏర్పాటు చేశారు. మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ బోర్డులు తగిలించుకుని వైద్యం చేస్తున్నారు. వైద్యులు ఆస్పత్రుల్లో లేకపోయినా విజిటింగ్‌పై రప్పిస్తూ రోగులకు చికిత్స చేయించి డబ్బులు దండుకుంటున్నారు. ఇటీవలి తనిఖీల్లో ఇలాంటి ఆస్పత్రులను కూడా గుర్తించారు. గతంలో పనిచేసి వెళ్లిన వైద్యుల పేర్లు వాడుకుంటూ, ఇతర వైద్యులను రప్పించి, రోగులకు అవసరం లేకపోయినా టెస్టుల పేరిట దోచుకుంటున్నట్లు గుర్తించారు. టీఎస్‌ఎంసీ తనిఖీల్లో బోగస్ ఆస్పత్రుల బాగోతం బయటపడుతోంది. దీంతో లక్షల రూపాయల పెట్టుబడితో నెలకొల్పిన ఆస్పత్రులను కాపాడుకునేందుకు ఆయా ఆస్పత్రుల యజమానులు ప్రయత్నాలు చేస్తున్నారు.

పట్టింపులేని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ

ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణపై వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ 2022లో జిల్లా వ్యాప్తంగా ఉన్న 228 ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేసి, అనుమతులు లేని 19 ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు, క్లినిక్, ల్యాబ్‌లను సీజ్ చేసింది. వారంతా తర్వాత అనుమతులు పొంది తిరిగి తెరిచారు. ఆ తరువాత తనిఖీలకు బ్రేక్ పడింది. 2023 ఫిబ్రవరి నెలలో జిల్లాలో ఎథిక్స్ కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు జాతీయ వైద్య కమిషన్(ఎన్‌ఎంసీ) ముగ్గురు వైద్యులను సభ్యులుగా ఎంపిక చేసింది. ఈ కమిటీ ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం ఇష్టారాజ్యంగా మారింది. తాజాగా టీఎస్‌ఎంసీ సభ్యుల తనిఖీలతో వాటి బాగోతం బయటపడుతోంది.

టీఎస్‌ఎంసీ నుంచే తనిఖీలు

ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలి. కానీ నేరుగా వైద్యం చేస్తున్నారు. అనుమతులు, అర్హతలు లేకుండా పలువురు ఆస్పత్రుల్లో వైద్యం అందించి రోగుల ప్రాణంతో చెలగాటం ఆడుతున్నారు. దీనిపై ఫిర్యాదులు అందుతున్నాయి. కేవలం కమీషన్ల కోసం కొందరు ఆర్‌ఎంపీలు, వైద్యులు కూడా లేని ఆస్పత్రులకు రోగులను పంపిస్తున్నారు. వైద్యులు లేకున్నా, వారి పేర్లను వాడుకుంటూ, ఇతరులతో వైద్యం చేయిస్తున్నారు. అందుకే టీఎస్‌ఎంసీ తనిఖీలు నిర్వహిస్తోంది.

– డాక్టర్ ఎగ్గన శ్రీనివాస్, టీఎస్‌ఎంసీ సభ్యుడు

జాడలేని భారత్ రైస్!



కేంద్ర ప్రభుత్వం మార్కెట్‌లోకి విడుదల చేసిన భారత్ రైస్ బ్యాగులు

- కిలో రూ.29 కే విక్రయిస్తున్న కేంద్రం
- జిల్లాలో అందుబాటులోకిరాని విక్రయ కేంద్రాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బియ్యం ధరలు రోజు రోజుకూ ఆకాశాన్నంటుతున్నాయి. పెరుగుతున్న బియ్యం ధరలకు కళ్లెం వేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో దేశ ప్రజలకు రాయితీ ధరకు బియ్యం అందించాలని నిర్ణయించింది. కిలో రూ.29 చొప్పున భారత్ రైస్ పేరుతో అందుబాటులోకి తీసుకువచ్చింది. 5 కిలోలు, 10 కిలోల బస్తాలతో భారత్ రైస్‌ను విక్రయిస్తోంది. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలు ప్రారంభించింది. అమ్మకం ప్రారంభించి 62 రోజులు అవుతున్న జిల్లాలో మాత్రం ఈ బియ్యం కానరావడం లేదు. పౌర సరఫరాల శాఖ అధికారుల వద్ద భారత్ రైస్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారం లేకపోవడం గమనార్హం.

జాడలేని విక్రయ కేంద్రాలు..

ఇక మార్కెట్‌లో బియ్యం ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం సన్నబియ్యం ధర నాణ్యతను అనుసరించి కిలో రూ.35 నుంచి రూ.70 వరకు లభిస్తున్నాయి. ఈ ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు సన్నబియ్యం కొనే సాహసం చేయడం లేదు. అన్నివర్గాల ప్రజల ఇబ్బందిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రూ.29లకే కిలో బియ్యాన్ని విక్రయించేలా నిర్ణయం తీసుకుంది. కేంద్రం నిర్ణయం బాగున్నా భారత్‌రైస్ జిల్లాలో ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. నాఫెడ్(నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా), ఎన్‌సీసీఎఫ్(నేషనల్ కో ఆపరేటివ్ కన్జ్యూమర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా), కేంద్రీయ భండార్ ఔట్‌లెట్‌తోపాటు ఈ–కామర్స్ సంస్థలకు అప్పగించింది. ఈ కేంద్రాలకు అనుబంధంగా విక్రయ కేంద్రాలు లేకపోవడంతో రాయితీపై సరఫరా చేస్తున్న బియ్యం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని సామాన్యులకు అందడం లేదు. భారత్ రైస్ విక్రయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడం కూడా రాయితీ బియ్యం ప్రజలకు చేరకపోవడానికి మరో కారణమని భావిస్తున్నారు.

రేషన్ దుకాణాలైతే మేలు..

భారత్ రైస్ విక్రయాలు అన్ని ప్రాంతాల్లోనూ అందుబాటులో ఉండే రేషన్ దుకాణాల ద్వారా విక్రయించాలని మధ్య తరగతి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రేషన్ దుకాణాల ద్వారా అయితేనే భారత్ రైస్ అందరికీ అందుతాయని, కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం భారత్ ఆటా(గోధుమ పిండి) పేరుతో రూ.27.50కే మార్కెట్‌లోకి తీసుకురాగా రూ.60కే శెనగ పప్పు లభిస్తోంది. బియ్యం కూడా త్వరగా అందుబాటులోకి వచ్చేలా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ హామీ నెరవేరుస్తాం



ఐక్యత చాటుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, వినోద్, వివేక్, ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ

- మంత్రి శ్రీధర్‌బాబు
- పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం
- పాల్గొన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు

మంచిర్యాలటౌన్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతోపాటు, మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతీ హామీని అమలు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షతన మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ (సీతక్క)తో కలిసి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని ప్రతీ హామీ అమలు చేయడంతోపాటు, సంచార జాతులకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రైతులకు తాము ఏం చేయాలో పదేళ్ల రైతులను మోసం చేసిన బీఆర్‌ఎస్ చెప్పాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు, పదవులు వస్తాయని తెలిపారు. విభేదాలు పక్కనపెట్టి లోక్‌సభ ఎన్నికల్లో గడ్డం వంశీకృష్ణను పెద్దపల్లి ఎంపీగా గెలిపించాలని కోరారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన లిక్కర్ స్కాం, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు పక్కదారి పట్టించాలనే కేసీఆర్ పొలం బాట పేరుతో యాత్రలు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో తమ సెగ్మెంట్‌లో 75 శాతం ఓట్లు కాంగ్రెస్‌కు వేయించిన వారికి వచ్చే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో తానే స్వయంగా నామినేషన్‌కు, ఎన్నికల ఖర్చుకు డబ్బులు ఇస్తానని తెలిపారు. తనకు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మెజారిటీ కంటే రెట్టింపు మెజారిటీని ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఇచ్చి గెలిపించాలని పిలుపునిచ్చారు. చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, గడ్డం వినోద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసిన గడ్డం వెంకటస్వామి మనవడిగా రాజకీయాల్లోకి వచ్చిన గడ్డం వంశీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ, వేజ్‌బోర్డు అధ్యక్షుడు జనక్‌ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్, మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మన్లు రావుల ఉప్పలయ్య, వేణు, చిట్ల సత్యనారాయణ, ఒడ్డె రాజమౌళి, నాగరాణి, పూదరి తిరుపతి, తూముల నరేశ్, పెంట రజిత, గజ్జెల హేమలత, నాయకులు పాల్గొన్నారు.

ఫైనల్‌కు.. 'ప్రేరణ'!

- పూర్తయిన పాఠశాల స్థాయి ఎంపికలు
- ఈనెల 10న జిల్లాస్థాయి విద్యార్థుల ఎంపిక
- ప్రతీ జిల్లా నుంచి ఇద్దరికి మాత్రమే అవకాశం!

మంచిర్యాలఅర్బన్: వేసవి సెలవుల్లో విద్యార్థుల మేధస్సుకు పదునుపెట్టి సృజనాత్మకతను వెలికి తీసేలా కేంద్ర ప్రభుత్వం ప్రేరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే తొమ్మిది, పది, ఇంటర్ విద్యార్థులు అర్హులుగా ప్రకటించారు. ఈమేరకు ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఈ క్రమంలో పాఠశాలస్థాయిలో మెరిట్ ఆధారంగా జిల్లాస్థాయికి విద్యార్థులను ఎంపిక చేశారు. వీరి నుంచి ఇద్దరు విద్యార్థులను జిల్లా తరఫున ఎంపిక చేయనున్నారు. ప్రేరణకు ఎంపికైన విద్యార్థులకు గుజరాత్‌లోని మోహసానా జిల్లా వాడ్‌నగర్‌లోని వెర్నాక్యులర్ పాఠశాలలో వారం రోజులు శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రేరణ ఉత్సవం ఇలా..

జిల్లాలో గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పాఠశాలస్థాయి, జిల్లాస్థాయి ప్రేరణ ఉత్సవం నిర్వహిస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో 9 నుంచి 12 వరకు చదివే విద్యార్థులు ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు అర్హులు. ఇప్పటికే పాఠశాల స్థాయి ఎంపిక పూర్తి చేశారు. వీరికి ఈనెల 10 వికసిత భారతం, సమాజానికి, దేశానికి నా యొక్క చేయూత అనే అంశాలపై పోటీ నిర్వహించనున్నారు. నోడల్ అధికారి, ప్రిన్సిపాల్ కేంద్రీయ విద్యాలయం పర్యవేక్షణలో పోటీలు జరుగనున్నాయి.

పాఠశాల స్థాయిలో ఇలా..

'ప్రేరణ' ఉత్సవ్‌లో భాగంగా పాఠశాల స్థాయిలో వ్యక్తృత్వ, పాటలు, పెయింటింగ్, స్టోరీ రైటింగ్ పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ కనబరిచిన వి ద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. ఇలా జి ల్లా వ్యాప్తంగా 170 మంది జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 10న కేంద్రీయ విద్యాలయంలో వీరికి ప్రేరణకు నన్ను ఎందుకు ఎంపిక చేయాలి, భారతదేశంపై నావిజన్, వికసిత్ భారత్, అనే అంశాలపై పోటీలు నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చూపిన 30(బాలురు, బాలికలు)విద్యార్థులను వ్యక్తిగత ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. వీరిలో నుంచి ఇద్దరిని జిల్లా తరఫున ఎంపిక చేశారు.

ప్రేరణకు ఎంపికైతే..

ప్రేరణకు ఎంపికైన విద్యార్థులను వాడ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో పురావస్తు, చారిత్రక కట్టడాలకు తీసుకెళ్తారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఇక్కడికి వస్తారు. ఇతర రాష్ట్రాల జీవనశైలి, సంస్కృతి, సంప్రదాయాలు తెలుస్తాయి. చంద్రుడిపై చంద్రయాన్ ల్యాండింగ్ నుంచి పలు విషయాలపై అవగాహన కల్పిస్తారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, త్రీడీ ప్రింటింగ్, నాయకత్వ లక్షణాలు, భి న్నత్వంలో ఏకత్వం, యోగా, ధైర్యసాహసాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు.

విద్యార్థులకు మంచి అవకాశం



కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రేరణ కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రేరణ కార్యక్రమం విద్యార్థులకు మంచి అవకాశం. జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ప్రేరణ ద్వారా ప్రేరణకు ఎంపికవుతారు. వీరిని వారం రోజులపాటు గుజరాత్ వాడ్‌నగర్‌లో శిక్షణ ఇస్తారు. పురవస్తు, చారిత్రక కట్టడాలు చూసే అవకాశం ఉంటుంది.

– ఎస్.యాదయ్య, డీఈవో

గుడుంబా గుప్పు

- దాడులు చేస్తున్నా ఆగని తయారీ..
- ప్రత్యామ్నాయం లేక పాత ఉపాధివైపు..
- 90 రోజుల్లో 190 కేసులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో మళ్లీ గుడుంబా గుప్పుమంటోంది. గతంలో గుడుంబా తయారు చేసి పట్టుపడి జైలుకు వెళ్లిన వారు సైతం మళ్లీ అదే వృత్తిని నమ్ముకుంటున్నారు. చట్ట వ్యతిరేకం అని తెలిసినా, ప్రత్యామ్నాయ ఉపాధి లేక గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నారు.

ఉపాధిగా మార్చుకుని..

జిల్లాలోని మారుమూల గ్రామాలకు చెందిన గిరిజనులు గుడుంబా తయారీనే జీవనోపాధిగా మార్చుకున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు చేస్తున్నా గుడుంబా తయారీ మాత్రం ఆపడం లేదు. జైలుకు వెళ్లొచ్చి మళ్లీ తయారీ కొనసాగిస్తున్నారు. ఇక గుడుంబా తయారీకి అవసరమైన ముడి సరుకు మార్కెట్‌లో విచ్చలవిడిగా దొరుకుతోంది. దీంతో అటవీ గ్రామాల్లో గుడుంబా తయారు చేసి సమీప గ్రామాలతోపాటు కోల్‌బెల్ట్ ఏరియాకు సరఫరా చేస్తున్నారు. పట్టణాల్లోని బెల్టుషాపుల్లో గుడుంబా సైతం దొరుకడమే ఇందుకు నిదర్శనం.

90 రోజుల్లో 190 కేసులు..

జిల్లాలో ఈ ఏడాదిలో 90 రోజుల్లో 190 గుడుంబా కేసులు నమోదు చేయడం గమనార్హం. ఈ కేసుల్లో 189 మందిని అరెస్ట్ చేశారు. 178.5 లీటర్ల గుడుంబా, 3,500 లీటర్ల బెల్లం పానకం, 210 కిలోల బెల్లం, 11 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. 37 వాహనాలను సీజ్ చేశారు.



కిష్టంపేట గ్రామంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడిన గుడుంబా(ఫైల్)

ప్రత్యామ్నాయ ఉపాధి లేక..

గతంలో గుడుంబా తయారీ, విక్రయదారులకు ఎక్సైజ్ అధికారులు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించారు. 204 మందికి రుణాలు అందించి వ్యాపారాలు పెట్టుకునేలా ప్రోత్సహించారు. తర్వాత మిగతా వారిని పట్టించుకోలేదు. ఉపాధి కల్పిస్తారని ఎదురు చూసి నవారు మళ్లీ గుడుంబా తయారీ మొదలు పెట్టారు.

రాత్రివేళల్లో రవాణా..

జిల్లాలోని మందమర్రి మండలం పులిమడుగు, చిర్రకుంట, నెన్నెల, భీమారం మండలం పోలంపల్లి, హాజీపూర్ మండలం పెద్దంపేట, ర్యాలీగడ్‌పూర్, కోటపల్లి, జన్నారం మండలం మొర్రిగూడ గ్రామాల్లో గుడుంబా తయారీ ఎక్కువగా చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. రాత్రి వేళల్లో సైకిళ్లు, ద్విచక్రవాహనాలపై ఇతర గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలకు సరఫరా చస్తున్నారు.

మళ్లీ.. మళ్లీ పట్టుబడుతూ..

గుడుంబా నియంత్రణకు ఎక్సైజ్ అధికారులు చేస్తున్న దాడుల్లో పలువురు పట్టుపడుతున్నారు. వారిని అరెస్ట చేస్తున్నారు. జైలుకు వెళ్లి బయటకు వచ్చిన తర్వాత మళ్లీ గుడుంబా తయారు చేస్తున్నారు. ఇలాంటి వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నారు. రూ.లక్ష పూచీకత్తు పెడుతున్నారు. అయినా పాత దారిలోనే వెళ్తున్నారు.

కఠినంగా శిక్షలు..

గుడుంబా తయారీకి వినియోగించే ముడి సరుకు విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ప్రస్తుతం గుడుంబా, డ్రగ్స్, గంజాయి కేసుల్లో శిక్షల స్వరూపం మారిపోయింది. బెల్లం అమ్మితే 15 రోజుల వరకు బెయిల్ మంజూరు కావడంలేదు. గుడుంబా రహిత జిల్లాగా ప్రజలు సహకరించాలి. తయారీదారుల సమాచారం అందించాలి.

– కేజీ నందగోపాల్, జిల్లా ఎక్సైజ్ అధికారి

చట్ట సభల్లో వాటా కోసం పోరాటం

- బీసీ ఐక్యవేదిక నాయకులు
- జిల్లా కేంద్రంలో ప్రారంభమైన బీసీ ప్రజా చైతన్యయాత్ర
- ఈనెల 15 వరకు జిల్లాలోనే యాత్ర

పాతమంచిర్యాల: చట్ట సభల్లో బీసీల వాటా కోసం పోరాటం చేద్దామని బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, బీసీ ఉద్యమ నాయకురాలు పేరం అలేఖ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీ ప్రజా చైతన్య యాత్ర ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల న్యాయమైన హక్కులు నిలబెట్టేవారి పక్షానే బీసీలు నిలబడాలన్నారు. బీసీలు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న కుల గణన జాతీయస్థాయిలో నిర్వహించాలన్నారు. బీసీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చడంలో రాజకీయ పార్టీలు తమ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.



యాత్ర ప్రారంభిస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

బీసీ కుల గణన చేపట్టి రిజర్వేషన్లు పెంచాలని, అగ్రవర్ణాల రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిబాపూలే అందించిన బహుజన చైతన్యంతో బీసీలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బీసీ ఐక్య వేదిక నాయకులు కనుకుట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, గాండ్లతేలికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధి చంద్రమౌళి, సింగరేణి ఉద్యోగుల ఐక్యవేదిక నాయకుడు కోటిలింగం, నాయకులు నీరటి రాజన్న, శంకరయ్య, గణేశ్, నటేశ్వర్, అంజయ్య,దేవయ్య, వెంకటేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి


వెంకటేశ్వర్లు మృతదేహం

మందమర్రిరూరల్(చెన్నూర్): పట్టణంలోని ఫస్ట్ జోన్ మార్కెట్ ఏరియాకు చెందిన సింగరేణి కార్మికుడు పాయం వెంకటేశ్వర్లు (53) శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్కే ఓసీపీలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై పాత బస్టాండ్ వరకు వెళ్లి వస్తుండగా రామన్‌కాలనీ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆర్కేపీ సింగరేణి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నగదు పట్టివేత


పట్టుకున్న నగదుతో ఎస్సై, సిబ్బంది

సిర్పూర్(టి): ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వెంకట్రావ్‌పేట్ చౌరస్తా వద్ద ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1,89,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు. లోకిని గణేశ్ అనే వ్యక్తి మహారాష్ట్ర నుండి పెద్దపల్లి జిల్లా హనుమంతునిపేట్ గ్రామానికి ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తూ పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. నగదు స్వాధీనం చేసుకుని ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు అప్పగించారు.

వాంకిడి: మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.60 వేల నగదు పట్టుబడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. జెండాగూడకు చెందిన జాడి అశోక్ ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నగదును సీజ్ చేసి ఎస్ఎస్‌టీ టీంకు అప్పగించారు.

కత్తితో బెదిరించి.. డబ్బులు కాజేసి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మ్యాదరివాడ మ్యాక్స్‌భవన్ వద్ద బస్సు దిగి వెళ్తున్న వ్యక్తిని కత్తితో బెదిరించి డబ్బులు కాజేసిన ఘటన జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు రాంనగర్‌కు చెందిన బొగ్గు మల్లేశ్ ఈ నెల 6న లక్సెట్టిపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా మ్యాక్స్ భవన్ వద్ద ఎదురుగా వచ్చిన ఆటోలోంచి ఇద్దరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. కొంత దూరం తీసుకెళ్లి కత్తితో బెదిరించి అతని వద్ద ఉన్న రూ.6 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసి నిందితులకోసం గాలిస్తున్నామని సీఐ భన్సీలాల్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో దంపతుల రిమాండ్

కౌటాల: హత్యాయత్నం కేసులో దంపతులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మార్చి 27న కౌటాల మండలంలోని బాలేపల్లికి చెందిన కోబ్రాగడే దీప్‌చంద్‌పై అదే గ్రామానికి చెందిన జాడి బాలు, జాడి ప్రియాంక గొడ్డలితో దాడిచేసి గాయపరిచారు. బాధితుడి సోదరి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు దంపతులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించమన్నారు.

తునికాకు షెడ్యూళ్లపై నిరాసక్తత

ఎండాకాలంలో గ్రామీణులకు ఉపాధి కల్పించే తునికాకు సేకరణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. మారుతున్న పరిస్థితుల ప్రభావంతో కాంట్రాక్టర్లు తునికాకు సేకరణ కోసం టెండర్ షెడ్యూళ్లను కొనుగోలు చేయడానికి నిరాసక్తత చూపుతుండటం ప్రతి బంధంగా మారుతోంది. తద్వారా ఆకు సేకరణ లక్ష్యం పడి పోయి గ్రామీణ కూలీలకు ఉపాధి రోజులు తగ్గుతున్నాయి. ఈ పరిణామాల క్రమంలో అనాది నుంచి వస్తున్న తునికాకు సేకరణపై కూలీలు క్రమంగా ఆశలు వదులుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.


అటవీ ప్రాంతంలో ఎదుగుతున్న తునికాకు

- 8 యూనిట్లలో కేవలం మూడింటికే షెడ్యూళ్లు
- లాభాలు రావడం లేదని కాంట్రాక్టర్లు దూరం

బెల్లంపల్లి: ప్రభుత్వం ఏటా అటవీశాఖ ఆధ్వర్యంలో తునికాకు సేకరణ జరుపుతుంది. యూనిట్ల వారీగా టెండర్లను ఆహ్వానించి కాంట్రాక్టర్ల ద్వారా అటవీ అధికారులు ఆకు సేకరణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే తునికాకు టెండర్ షెడ్యూళ్ల కొనుగోలుకు గడిచిన నాలుగైదేళ్ల నుంచి సానుకూలత వ్యక్తం చేయడం లేదు. అతికష్టంగా ఒకటి ,రెండు యూనిట్లకు మాత్రమే టెండర్ షెడ్యూళ్లను కొనుగోలు చేసి మమ అనిపిస్తున్నారు. ఆకు సేకరణ ద్వారా లాభాలు అంతగా రావడంలేదనే కారణంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేక పోతున్నట్లు తెలుస్తుండగా తునికాకు సేకరణ లక్ష్యంపై ప్రభావం పడుతోంది. టెండర్ షెడ్యూల్ దాఖలు చేసి కాంట్రాక్టును చేజిక్కించుకున్నాక అటవీ అధికారులు నిర్దేశించిన యూనిట్ పరిధిలో చాక్‌తరస్ (కొమ్మ కొట్టే పనులు) చేపడుతారు. కూలీలతో కొమ్మకొట్టే పనుల ప్రక్రియను దాదాపు మార్చి మొదటి వారంలోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ ఈసారి ఏప్రిల్ నెలాఖరులోగా కొమ్మ కొట్టే పనులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి కాంట్రాక్టర్లకు అనుమతి మంజూరు చేశారు.

మూడు యూనిట్లలో షెడ్యూళ్ల అమ్మకాలు

బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధిలో బెల్లంపల్లి, కుశ్నపల్లి రేంజ్‌లు ఉండగా ఆయా రేంజ్‌ల పరిధిలో నార్వాయిపేట, కుశ్నపల్లి, వేమనపల్లి, బెల్లంపల్లి, ధర్మారావుపేట, తాండూర్, లింగాల, నెన్నెల యూనిట్లను ఏర్పాటు చేశారు. తునికాకు సేకరణ కోసం కేవలం నార్వాయిపేట, కుశ్నపల్లి, వేమనపల్లి యూనిట్లకు సంబంధించిన టెండర్ షెడ్యూళ్లు అమ్ముడు పోగా మిగతా 5 యూనిట్ల టెండర్ షెడ్యూళ్లను కొనుగోలు చేయకుండా కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. కొనుగోలు చేయని యూనిట్లలో ఆకు సేకరణ జరిగే అవకాశాలు లేకుండా పోగా కూలీలకు మండుటెండలో ఉపాధి మృగ్యం కానుంది. గతేడాది కూడా సరిగ్గా ఇదే తీరుగా జరిగింది. నార్వాయిపేట, కుశ్నపల్లి, వేమనపల్లి యూనిట్ల షెడ్యూళ్లను కొనుగోలు చేసి ఆకు సేకరణ చేయడం గమనార్హం.

కట్ట ధర రూ.3

తునికాకు కట్ట ధరను ప్రభుత్వం ఖరారు చేసింది. పెరుగుతున్న నిత్యావసరాల ధరలను అంచనా వేసి కూలీలకు గిట్టుబాటు ధర నిర్ణయించింది. 50 ఆకులను పేర్చి తునికాకు కట్టను తయారు చేస్తారు. ఒక్కో కట్టకు రూ.3 చెల్లించి అటవీ శాఖ తునికాకును సేకరిస్తుంది. నిర్దేశించిన గ్రామాల్లో కల్లెదార్లను ఎంపిక చేసి ఆకు సేకరణ చేయనున్నారు.

మే చివరి వారంలో ఆకు సేకరణ

ఆలస్యంగా కొమ్మకొట్టే పనులు జరగనుండటంతో ఆకు సేకరణ కూడా మరింత ఆలస్యం కానుంది. వారం రోజుల్లో చాక్‌తరస్ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. చాక్ తరస్ చేశాక తునికాకు లేత చిగురు వచ్చి నాణ్యతగా ఎదగడానికి గరిష్ఠంగా 45 రోజుల కాలం పడుతుందనేది అటవీ అధికారుల అంచనా. ప్రస్తుత పరిస్థితుల రీత్యా ఆకు సేకరణ పనులు మే చివరి వారంలో ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది.

యూనిట్ల వారీగా ఆకు సేకరణ లక్ష్యం

యూనిట్	స్టాండర్డ్ బ్యాగులు
నార్వాయిపేట	1,600
కుశ్నపల్లి	1,400
వేమనపల్లి	3,000
బెల్లంపల్లి	700
ధర్మారావుపేట	800
తాండూర్	600
లింగాల	1,600
నెన్నెల	3,000
మొత్తం	12,700

ఎండాకాలంలో పని దొరుకుతుంది



ఎండాకాలంలో బతుకుదెరువు కోసం ఇంకో ఊరుకు వెళ్లకుండా తునికాకు సేకరణతో పనులు దొరుకుతయ్. కానీ సరిగ్గా ఆకు సేకరణ జరుగుత లేదు. ఇంటిల్లిపాదిమి అటవీ ప్రాంతానికి వెళ్లి ఆకు సేకరించడం వల్ల రోజు కూలీ లభించేది. జంగ్లాతోళ్లు కూలీలతో ఆకు సేకరణ పనులు చేయించాలె.

– మేకల లక్ష్మి, దాంపూర్

కట్ట ధర పెంచాలి



దినసరి సరుకుల ధరలు రోజురోజుకూ మస్తు పిరమైతన్నయ్. ఎర్ర టెండల ఆకు సేకరించే కూలీల గురించి సర్కారు ఇసారంజెయ్యాలె. గాసం ధరలు పెరుగుతున్నట్లు తునికాకు కట్ట ధర సుత ఇంకింత పెంచితే మంచి గుంటది. కట్టకు రూ.5 చొప్పున ధర చెల్లిస్తే పాయిద ఉంటది.

– కొండపల్లి వెంకటి, వేమనపల్లి

నెలరోజులు సుత ఆకు కోత్తలేరు



మునుపు నెల పదిహేను రోజుల దాక తునికాకు కోసేది. ఎండాకాలం వచ్చిందంటే మహా సంబురం అనిపించేంది. ఊరంతా కలిసి తెల్లారక ముందే అడవికి బోయి చెట్టుపుట్ట తిరిగి ఆకు సేకరించి అంబటాళ్లయ్యేసరికి ముల్లెలతో ఇంటికి వచ్చేది. ఇప్పుడు వారం, పది దినాలు సుత కాక ముందే ఆకు కోసుడు బంద్ జేత్తండ్లు.

– కొద్దని చీకటి, నెన్నెల

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యంతో ఎస్సై సురేశ్, సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్లలో ఆసాది రమాదేవి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సదరు మహిళ ఇంట్లో తనిఖీ నిర్వహించగా 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. సదరు మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ డంప్‌లు.. అడ్డగోలు రవాణా


ముల్కల్ల శివారులో ఇసుక నిల్వలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అక్రమార్కులు వేంపల్లి, ముల్కల్ల, బుగ్గగట్టు, రాపల్లి, హాజీపూర్ తదితర గ్రామాల శివారుల్లోని పొలాలు, వెంచర్లలో ఇసుక డంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. రాత్రికి రాత్రి వివిధ ప్రాంతాలకు ఇసుకను రవాణా చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు బిజీగా ఉండటంతో ఇసుక వ్యాపారులు దందా జోరుగా సాగిస్తున్నారు. ఏదిఏమైనా పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

సమాజ పక్షం నిలిచేవారు కవులు

మంచిర్యాలఅర్బన్: సమాజంలో జరుగుతున్న సన్నివేశాలను కవి దర్శించి అట్టి అంశాలను తనదైన రీతిలో స్పందిస్తూ సమాజ పక్షం నిలిచేవారు కవులని అడిషనల్ కలెక్టర్ రాహుల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో సాహితీ సంరక్షణ సమితి, సంగీత సాహిత్య సుధా వాహిని సంయుక్తంగా శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది స్వాగత కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు అంటే ఎంతో మక్కువని, తెలుగు నుంచి ఐఏఎస్ పరీక్షలకు సిద్ధమైన విషయాన్ని గుర్తు చేశారు. నాడు నేడు అంటూ తన స్వీయ రచనతో కవితను వినిపించారు.


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్

అంతస్మితం గేయ సంపుటి ఆవిష్కరణ

కవయిత్రి అడ్డగూరి శ్రీలక్ష్మి అంతస్మితం గేయ సంపుటిని శతావధాని మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ ఆవిష్కరించారు. సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వామన్‌రావు, శ్రీనివాస్, రాజేశం, రాజిరెడ్డి, శ్రీనాథ్‌గౌడ్, పెద్ది భరత్ కవితాగానం ఎంతగానో అలరించింది.

రామారావ్ చూపిన మార్గంలో నడవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

జన్నారం(ఖానాపూర్): యువత సంత్ శ్రీ రామారావ్ మహారాజ్ చూపిన మార్గంలో నడుచుకోవాలని దీక్ష గురువు సంత్ ప్రేంసింగ్ మహారాజ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం జన్నారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీ సంత్ రామారావ్ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జువ్విగూడలో సేవాలాల్ మహారాజ్ ఆలయం ఎదుట పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేటి యువత చెడు మార్గం వైపు అడుగులు వేయకుండా సన్మార్గంలో నడవాలన్నారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్, బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సుగుణ, ఆసిఫాబాద్ ఇన్‌చార్జి శ్యాంనాయక్, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ సరోజన, విగ్రహ కమిటీ సభ్యులు సందేశ్, ప్రకాశ్‌నాయక్, రాములు, భీంలాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

సినీఫక్కీలో ఘరానా మోసం

- వృద్ధ దంపతుల నుంచి రూ.18 వేలు అపహరించిన దుండగులు

జన్నారం: అమాయక వృద్ధ దంపతులను మోసగించి వారి నుంచి రూ.18 వేలు అపహరించిన ఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. వృద్ధ దంపతులు సామల్ల బుచ్చయ్య, రాజవ్వ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం బుచ్చయ్య ఇంటికి నంబర్ ప్లేట్ లేని బైక్ పై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. పక్కనే కొత్తగా కట్టుకుంటున్న రాజేందర్ ఇంటి కోసం ఇటుక వేశామని, అతను డబ్బుల కోసం బ్యాంక్‌కు వెళ్లాడని, రూ.20 వేలు మీ వద్ద తీసుకొమ్మని చెప్పాడని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన వృద్ధుడు అయితే డబ్బులు తన వద్ద లేవని, మా ముసలమ్మ వద్ద ఉన్నాయని, ఆమె తాళ్లపేటకు వెళ్లిందని చెప్పాడు. వృద్ధున్ని తీసుకుని తాళ్లపేటలో ఉన్న రాజవ్వ వద్దకు వెళ్లారు. వారి వద్ద రాజేందర్‌కు ఫోన్ చేసి మాట్లాడినట్లు నటించారు. ఆ తర్వాత బుచ్చయ్యను అక్కడే ఉంచి రాజవ్వను బైక్‌పై తిమ్మాపూర్‌కు తీసుకువచ్చారు. వారి మాటలు నమ్మిన రాజవ్వ నా వద్ద రూ.18వేలు మాత్రమే ఉన్నాయని చెప్పి వారికి ఇవ్వడంతో వెంటనే అక్కడి నుంచి ఉడాయించారు. ఆ తర్వాత రాజేందర్ అక్కడే కనిపించడంతో అయ్యో.. నీపేరు చెప్పి ఇద్దరు డబ్బులు తీసుకెళ్లారని చెప్పగా వాళ్లెవరో నాకు తెలియదని, నన్ను అడగకుండా వారికి డబ్బులు ఎందుకు ఇచ్చారన్నాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించి లబోదిబోమని మొత్తుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వృద్ధులు, మాజీ సర్పంచ్ గంగాధర్ తెలిపారు. ఈ విషయమై ఎస్సై రాజవర్ధన్‌ను సంప్రదించగా ఫిర్యాదు అందగానే విచారణ చేపడుతామన్నారు.


బాధిత వృద్ధ దంపతులు

బైక్ చోరీపై ఏసీపీ విచారణ

జన్నారం: జన్నారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మహేందర్ బైక్ చోరీపై ఆదివారం మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ విచారణ జరిపారు. కానిస్టేబుల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. పాత ఇనుప సామాను విక్రయించే వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించి విచారించినట్లు తెలిసింది. ఆయన వెంట సీఐ నరేందర్, ఎస్సై రాజవర్ధన్ ఉన్నారు.

స్వయం ఉపాధి దిశగా..

- ఆర్‌సెటి శిక్షణలో యువతులు, మహిళలు
- ఉచిత శిక్షణతో పాటు వసతి
- సద్వినియోగం చేసుకుంటున్న ఉమ్మడి జిల్లా యువత
- ఇప్పటి వరకు 9,102 మందికి శిక్షణ

ఉట్నూర్‌రూరల్: సమాజం మారింది.. మనమూ మారాలి.. అప్పుడే పురోగతి సాధించగలుగుతాం.. కుటుంబానికి ఆసరాగా నిలబడగలుగుతాం.. సమాజానికి ఆదర్శంగా నిలువగలం.. అంటున్నారు మారుమూల ప్రాంతాల యువత. నేటి తరంలో బ్యూటీషియన్, టైలరింగ్, మగ్గం వర్క్‌లో శిక్షణ పొందాలని గిరిజన యువతులు, మహిళలు ముందుకు వచ్చి ఆర్‌సెటి వేదిక ద్వారా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతూ భవిష్యత్ తరాలకు బాటలు వేసుకుంటున్నారు. మగ్గం వర్క్, బ్యూటీషియన్, టైలరింగ్ ఎస్‌బీఐ ఆర్‌సెటి అందిస్తున్న శిక్షణలపై ప్రత్యేక కథనం.


టైలరింగ్ నేర్చుకుంటున్న యువతులు

శిక్షణ ఇస్తున్న కోర్సులు

యువతులతో పాటు ఇటు నిరుద్యోగ యువకులకు కూడా టూవీలర్ మెకానిక్, హౌజ్‌వైరింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, ఫ్రిజ్, ఏసీ, ప్లంబింగ్, శానిటరీ, క్యాంటర్ హార్డ్‌వేర్, నెట్‌వర్క్, ట్యాలీ, అకౌంటింగ్, సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, మోటార్ వైండింగ్, తదితర కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నారు.

ఎస్‌బీఐ–ఆర్‌సెటి ద్వారా శిక్షణ..

యువతకు ఇస్తున్న శిక్షణ మేలైన ఫలితాలు ఇస్తోంది. 2007లో ఉట్నూర్‌లోని కుమురంభీం కాంప్లెక్స్ ప్రాంగణంలో స్థాపించిన సంస్థ ప్రారంభం నుంచి ఇప్పటికీ 311 శిబిరాలు నిర్వహించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 9,102 మందికి శిక్షణ ఇచ్చింది. వీరిలో 7,566 మంది ఉపాధి అవకాశాలు పొందారు. 3,217 మందికి బ్యాంకు రుణాలు ఇచ్చింది. 6,524 మంది స్వయం ఉపాధి పొందగా 3,307 మంది స్వయం ప్రాజెక్టులు ప్రారంభించారు. 1,042 మంది ఇతర కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. 2023–24లోనూ 23 శిబిరాల ద్వారా 697 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యం పూర్తి చేశారు.

శిక్షణకాలంలో వసతి సౌకర్యాలు

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లాలో పదోతరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన యువతకు శిక్షణ కోర్సుల్లో ప్రవేశం కోసం ఎంపిక చేస్తారు. అభ్యర్థులు 18 నుండి 45 ఏళ్ల మధ్య వయస్సు వారై ఉండాలి. శిక్షణలో ఉచిత భోజనం, ఉదయం అల్పాహారం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. స్థానికులకు మధ్యాహ్నం భోజనం ఉంటుంది. శిక్షణ అనంతరం బ్యాంకు రుణం పొందేందుకు అవసరమైన సలహాలు అందిస్తారు.

ఆత్మ విశ్వాసం పెరిగింది



శిక్షణ కంటే ముందు ఇంటి దగ్గర ఖాళీగానే ఉండేదానిని. ఇప్పుడు ఈ శిక్షణ తీసుకోవడంతో స్వయం ఉపాధి పొందగలననే నమ్మకం, ఆత్మ విశ్వాసం పెరిగింది. శిక్షణలో నేర్చుకున్న మెలకువలు కుటుంబ సభ్యులతో పాటు తోటి వారికి నేర్పించి ఉపాధి రంగంలో రాణించేందుకు కృషి చేస్తా.

– మహేశ్వరి, కుమురంభీం జిల్లా

ఉపాధి అవకాశాలు ఎక్కువ



ప్రస్తుత రోజుల్లో బ్యూటీషియన్ వర్క్‌కు డిమాండ్ ఎక్కువ. ఈ శిక్షణను ఆర్‌సెటి సంస్థ ఉచితంగా అందరికీ నేర్పించడం చాలా సంతోషమైన విషయం, శిక్షణ కాలంలో ఫేషర్, మెహెంది డిజైన్, తదితర బ్యూటీపార్లర్‌కు సంబంధించి శిక్షణలు, అవగాహన కల్పించాం.. పిల్లలు సైతం చాలా బాగా నేర్చుకుంటున్నారు.

– రజిత, బ్యూటీషియన్ శిక్షకురాలు

ఇక్కడే నేర్చుకుని ఇక్కడే ట్రైనర్‌గా..



2017 బ్యాచ్‌లో ఇక్కడే కుట్టు మిషన్ శిక్షణ తీసుకున్నా. నాకున్న నైపుణ్యతను గుర్తించి అధికారులు హైదరాబాద్‌లో పరీక్ష అనంతరం సంస్థలో ట్రైనర్‌గా ఎంపిక చేశారు. కుట్టు శిక్షణ నేర్చుకోవడం వలన స్వయం ఉపాధి పొందటానికి మంచి అవకాశం. దీంతో ఇతరులకు ఉపాధి కల్పించవచ్చు.

– మాహెద, కుట్టుమిషన్ శిక్షకురాలు

ఉపాధి కల్పనే లక్ష్యం



ఉపాధి కల్పనే లక్ష్యంగా యువతీ యువకులకు శిక్షణ ఇస్తున్నాం. మా సంస్థలో అభ్యర్థుల ఇష్టం మేరకే కోర్సును నేర్చుకోవచ్చు. ఇదే శిక్షణ ప్రైవేటు సంస్థల్లో తీసుకోవాలంటే దాదాపు 20 నుంచి 30వేల రూపాయలు అవుతాయి. మేము వసతి సౌకర్యం, భోజనం, ఉచితంగా అందిస్తున్నాం.

– కె.లక్ష్మణ్, ఎస్‌బీఐ ఆర్‌సెటి డైరెక్టర్, ఉట్నూర్

చాలా బాగా నేర్పిస్తున్నారు



ఇక్కడ శిక్షణ ఇస్తున్నారని తోటి స్నేహితుల ద్వారా తెలుసుకున్నా. మగ్గం వర్క్‌తో పాటు అనేక రకాలుగా ఇక్కడ సులువైన పద్ధతిలో శిక్షణ ఇస్తున్నారు. నేటి తరానికి ఇలాంటి శిక్షణలు ఎంతో ఉపయోగపడుతాయి. చేతి వృత్తులకు మార్కెట్‌లో డిమాండ్ బాగుంది.

– నిరోషన్, మగ్గం వర్క్, కుమురంభీం జిల్లా

నమ్మకం పెరిగింది..



నేను మగ్గం వర్క్ నేర్చుకోవడానికి ఇక్కడికి వచ్చా. మగ్గం వర్క్ (వస్త్ర చిత్రకళ ఉద్యామి) నేర్చుకోవడం వలన భవిష్యత్‌లో స్వయం ఉపాధి పొందుతాననే నమ్మకం పెరిగింది.. అన్ని వసతులతో ఇలా శిక్షణ అందించడం బాగుంది. నా తోటి వారికి సైతం సలహాలు అందిస్తా.

– సౌజన్య, మగ్గం వర్క్, మంచిర్యాల జిల్లా, కవ్వాల్

భవిష్యత్‌లో రాణిస్తా..



టైలరింగ్ నేర్చుకునేందుకు ఇక్కడికి వచ్చా. నేటి పోటీ ప్రపంచంలో స్వయం ఉపాధి సైతం ఎంతో అవసరం. అన్ని విద్యలు నేర్చుకొని ఉంటే సమాజంలో నిలదొక్కుకుంటాం. భవిష్యత్‌లో ఖచ్చితంగా షాపు వేసుకొని నడిపిస్తాను. టైలరింగ్‌పై అవగాహన వచ్చింది. నెల రోజుల్లో నేర్చుకుంటానని అనుకోలేదు.

– శిరీష, మంచిర్యాల జిల్లా

వెంకట్రావు హాజరుపై కార్యకర్తల నిరసన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ, ఐఎన్టీయూసీ నాయకులు వెంకట్రావు హాజరై మాట్లాడుతుండగా కొందరు కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. సింగరేణి కార్మికులకు తీరని అన్యాయం చేసి, ఐఎన్టీయూసీని భ్రష్టుపట్టించిన వ్యక్తిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడం తమకు ఇష్టం లేదంటూ బహిరంగంగానే చెబుతూ బయటకు వెళ్లి పోవడం చర్చనీయాంశంగా మారింది. వేదికపై మంత్రి దనసరి అనసూయ(సీతక్క)తో పాటు, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వివేక్ వెంకటస్వామి, గడ్డం వినోద్ ఉండగానే కార్యకర్తలు బయటకు వెళ్లిపోయారు.

మహిళా ఉద్యోగులపై వేధింపులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గనిపై మహిళా ఉద్యోగినితో ఆ గని ఆఫీస్ సూపరింటెండెంట్ బూట్లు కడిగించుకున్న వీడియో రెండురోజుల క్రితం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై పలు కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. మహిళా ఉద్యోగుల పట్ల వేధింపులకు పాల్పడుతున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పలు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.